ఓంశ్రీసాయిరాం

సకల విద్యలు నేర్చి సభజయించగ వచ్చు
శూరుడై రణమున పోరవచ్చు
రాజరాజై పుట్టియు రాజ్యమేలగవచ్చు
హేమగోదానముల్ యీయవచ్చు
గగనంపు చుక్కలు గణియింపగావచ్చు
జీవరాసుల పేర్లు చెప్పవచ్చు
అష్టాంగవిద్యలనన్ని నేర్వగవచ్చు
చంద్రమండలయాత్ర సలుపవచ్చు
కాని దేహేంద్రియాదులకట్టిపెట్టి
మనసునిల్పియు నంతర్ముఖముచేసి
అనవరత నిశ్చల సమాధిచిత్తుడై
నిలువ గలడ.......

ప్రేమస్వరూపులారా!

ఈనాడు విద్యారంగమందు అనేకవిధములైన సంప్రదింపులు జరుగుతూనే ఉంటున్నాయి. అసలు ఎడ్యుకేషన్ అంటే ఏమిటని మొట్టమొదట గుర్తించటానికి ప్రయత్నించాలి. ప్రపంచములోనున్న గ్రందములన్నీ చదవవచ్చు, దాని అర్థములను వివరించవచ్చు. ఇంతమాత్రముచేత తాను చదువరి కాడు. లోకములో చదువరులు అనేకమంది ఉంటున్నారు. ప్రపంచములో ఉన్నతవిద్యను అభ్యసించిన మహాజనులు కనిపిస్తూనే ఉన్నారు. అయితే యీ చదువు వల్ల వారు చేసిన మార్పు ఏమిటి, జగత్తుకు ఏమి అందిస్తూవచ్చారు, దీఇ వలన వచ్చిన ఫలితము ఏమిటి అనే విషయము గుర్తించుటకుఎవరూ ప్రయత్నించుటలేదు. విద్యవలన మార్పు యేనాటికీ కలుగదు. విద్య అంతర్ముఖము గావించుకున్నప్పుడే, దాని తత్త్వము అర్థము గావించుకొని దానిని గ్రహించగలరు. భౌతికమైన తెలివితేటలను అభివృద్ధిగావించుకుంటున్నారు. మాసిక సంబంధమైన విద్యలను అనేకంగా తర్కిస్తూ వచ్చారు. ఆధ్యత్మిక తత్త్వమునందు అనేకమంది ఆత్మతత్త్వము గురించి విచారణ చేస్తూ వచ్చారు. ఈ మూడింటి తత్త్వము మనం గర్తించే మన కాలేజీలో ఎమ్.బి.ఎ. కోర్సును ప్రారంభించాము. ఎమ్ అనగా మానసిక తత్త్వాన్ని గుర్తించటము. బి అనగా భౌతిక తత్త్వాన్ని గుర్తించటము. ఎ అనగా ఆత్మతత్త్వాన్ని విచారించటము. ఎమ్.బి.ఎ. అనగా అనేకమంది మానసిక తత్త్వాన్ని గుర్తించటమనే తెలుపుతున్నారు. అదికాదు. మానసిక తత్త్వాన్ని గుర్తించటము సులభమే. కానీ ఆత్మతత్త్వాన్ని అర్థము చేసుకోటం మరింత కష్టము. ఆత్మ అనగా ఏమిటో ఎవరికీ అర్థముకాదు. దానికి ఒక రూపము లేదు. ఆత్మ అనగా కేవలం చైతన్యముతో కూడిన తత్త్వమే. ఈ ఆత్మ తత్త్వమునే కాంక్షస్‌నెస్ అని అర్థము చేసుకోటం లేదు. కానీ యీ చదువరులు కేవలం కాంక్షస్ వరకు మాత్రమే పోగలుగుతున్నారు. కొంమంది యీ కాంక్షస్ వరకు చేరగలుగుతున్నారు. అనగా యీనాటి మానవుడు ఆత్మతత్త్వమును, నిజమైన చైతన్యమును చేరుటకు ఎవరూ ప్రయత్నించటం లేదు. ఈనాడు మనము కాంక్షస్‌నెస్ అర్థము చేసుకున్నప్పుడే కాంక్షన్సు అర్థమవుతుంది. ఈ కాంక్షన్సు అర్థమైనప్పుడే కాంక్షియన్సు అనగా సెన్సెతో కూడిన విషయము మనము బోధించవచ్చును. కాంక్షన్సు లోపలి చైతన్యము. కాంక్షస్‌నెస్ అనేది సర్వత్ర వ్యాపించిన ఆత్మతత్త్వమే. ఈనాటి మానవులెవరూ సరైన అర్థమును గుర్తించుటకు ప్రయత్నించుటలేదు.

విద్యార్థులారా!

ఆధ్యాత్మికతత్త్వము కేవలము అర్ధముకాని విషయమని మీరు భావించుకొనవచ్చును. దీనినే మనము సంపూర్ణమైన తత్త్వముగా భావిస్తూ రావాలి. ఈ ఆత్మతత్త్వన్ని అర్ధముచేసుకోవాలంటే కేవలము భౌతికమైన జగత్తులో మనము అర్ధము చేసుకోలేము. మెటీరియల్ నాలెడ్జి వరకు మాత్రమే పోగలుగుతున్నారు. దీనికి అతీతమైన తత్త్వాన్నే మనము  కాంక్షస్‌నెస్ అని మనము తెలుసుకోవాలి. ఈ ఫండమెంటల్ నాలెడ్జిని మనం తెలుసుకుంటే లౌకికమైన, భౌతికమైన వస్తువులనుగూర్చి తెలుసుకోటానికి మనం ప్రయత్నించవచ్చు.

విద్యార్థులారా!

ఆధ్యాత్మికమనగా అర్ధముకాని తత్త్వమని మీరు భావించుకోకూడదు. అంతర్భావముతో కూడిన చైతన్య శక్తియే. ఎవేర్‌నెస్ అనగా ఏమిటి? మనం ఒక విషయాన్ని గుర్తించుకోటం అనుకుంటారు. (కర్చీఫ్ చూపి) ఇది ఏమిటి అంటే ఒక కర్చీఫ్. ఇది ఎవేర్‌నెస్. ఇది ఏమిటి అంటే ఫ్లవర్ అంటున్నావు. ఇది ఎవేర్‌నెస్. ఇవన్నీ భౌతికమైన వస్తువుల రూపములు. ఇది బట్ట. దీనికి ఆధారము ఏది? దారము లేకుండా వస్త్రము కాలేదు. పత్తిలేకుండా దారము లేదు. పత్తి మొదట. రెండవది దారము. మూడవది వస్త్రము. వస్త్రాన్ని మాత్రమే మనము గుర్తిస్తున్నాముగానీ వస్త్రానికి ఆధారమైన తత్త్వాన్ని గుర్తించటంలేదు. ఈనాటి మానవులు అనేకరకములైన్వఇషయాలను విచారణచేస్తూ వస్తున్నారు. కొన్ని రకములైన భావముతో చూచినప్పుడు వస్తువు యొక్క విషయాన్ని అర్ధము చేసుకోటం లేదు. అన్నీ చెబుతూ వస్తున్నారేగానీ యిది యేమిటని ఎవరూ గుర్తించటంలేదు. ఈనాడు లోకములో గర్తించవలసినది ఆత్మతత్త్వము ఒక్కటే. ఆత్మతత్త్వమును గుర్తించినవాడు అన్ని తత్త్వములను సులభంగా గుర్తించగలడు.

ఆత్మతత్త్వమనగా ఏమిటి? శరీరమున్నది. ఈ శరీములో అన్ని రకములైన అంగములు ఉంటున్నవి. అంగములన్నీ పనిచేస్తూనే ఉన్నాయి. అయితే యివి పనిచేయటానికి ఏది ఆధారము? చేతితో పుష్పాన్ని పట్టుకున్నప్పుడు చేతికి శక్తి ఏది యిస్తున్నాది? ఈ పుష్పాన్ని ముక్కుతో వాసన చూస్తున్నాము. ఈ వాసన గ్రహించే శక్తి ఎక్కడనుంచి వస్తున్నాది? ఇవన్నీ భౌతికమైన వాటిని తెలుపుతున్నాయి కానీ అంతర్ముఖమైన ఆత్మతత్త్వాన్ని బోధించటానికి ప్రయత్నించటం లేదు. ఇది నా చేయి, యిది నా కాలు, యిది నా తల అంటున్నావు. కానీ నీ వెవరు? నీవు అనేది అర్థం చేసుకుంటేకదా యిది నా తల అని చెప్పటం. ఈ తల ఎవరిది? ఈ కాలు ఎవరిది? ఇవన్నీ తెలుసుకోకుండా నేను అని అంటున్నావు కానీ నీవు ఎవరు? నేను అనేది తెలుసుకోటమే వేదాంతము అన్నారు. ప్రతి వ్యక్తీ 'నీవెవరు? ఎక్కడనుండి వచ్చావు?' అని అడుగుతుంటారుగానీ 'నేను ఎవరు?' అని ప్రశ్న వేసుకోటంలేదు. 'నేను' గుర్తించుకుంటే అన్నీ గుర్తించినవారమౌతాము. ఆధ్యాత్మిక తత్త్వమనగా అర్ధముకాని, వ్యర్ధముకాని తత్త్వము కాదు. అన్నింటికి మూలాధారమైన తత్త్వము ఒకటున్నది. దానిని గుర్తించుటకు మనము ప్రయత్నము చేయాలి.

ప్రేమస్వరూపులారా!

ప్రేమ అనేది ఎటువంటిది, ప్రేమలేక మానవుడు ఉండగలడా! లవ్ ఈజ్ గాడ్‌ఈ ప్రేమను మొట్టమొదట గుర్తించుకోవాలి. ప్రేమ లేక  ప్రాణమే లేదు. ప్రేమ లేక వస్తువులే లేవు. ప్రేమ లేక విషయములే కనిపించవు. కనుక, అన్నింటికీ అంతర్భూతమై శక్తి ఒకటి ఉంటున్నాది. చాలామంది చెబుతున్నారు సత్యము అని. సత్యము అంటే ఏమిటి? 'త్రికాలభాద్యం సత్యం' అన్నారు. కానీ యింతమాత్రముచేతనే సత్యమని మనం నిర్ణయము చేయకూడదు. త్రికాలములకు అతీతమైనది సత్యము. అసత్యము ఎక్కడనుండి వస్తున్నాది? 'సత్యంభ్రూయాత్, ప్రియం భ్రూయాత్, నభ్రూయాత్ సత్యమప్రియమ్' అన్నారు. కానీ ఈ సత్యమనేదానికి రూపము లేదు. రూపము లేదు కానీ దానికి అర్ధము ఉంటున్నాది. అటులనే 'ట్రూత్ ఈజ్ గాడ్, లవ్ ఈజ్ గాడ్' అంటున్నాము. అన్నింటికిని గాడ్ అని ఉపయోగించుకుంటున్నావు. గాడ్ అనేదాని యొక్క అంతరార్ధము ఏమిటి? నాస్తికుడు కూడా ఏదైనా తప్పు చేసినప్పుడు

‘ఓ మై గాడ్’ అంటాడు. తెలియని దానికి కూడా గాడ్ అని ఉపయోగ పెడుతున్నారు. ‘గాడ్’ కి నిజమైన అర్థము చెప్పలేరు. కనుక, సత్యానికి అర్థము చెప్పాలంటే స్వానుభూతియే. ఆ అనుభూతిని ఏరీతిగా నీవు గుర్తించగలవు? 1 ప్లస్1 రెండు అయింది. 2ప్లస్2 నాలుగు అయింది. 2మైనస్1 ఒకటి అయింది, అని యీ ప్లస్సులు, మైనెస్సులు చెప్పగలుగుతున్నారేగానీ మూలాధారమైనది ఏది? ఈ ప్రపంచములోని సమస్త పదార్థములను మనం చెప్పగలుగుతున్నాము. కానీ దీని సత్యస్వరూపము గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

ప్రపంచమంతయూ వస్తువులతో చేరినది. ఇదంతా మెటీరియల్ లోకం. కానీ దీనికి మించిన మెంటల్ లోకం మరొకటి ఉంటున్నాది. ఈ మెంటల్ లోకానికి అతీతమైనది మరొకటి ఉంటున్నాది. అదియే బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్. ఈ ట్రాంసెండెంటల్ అనేదానికి మనం ఎంతనో ప్రయత్నం చేస్తున్నాము. అయితే ఎన్నైనా మనం గుర్తించవచ్చు. ప్రపంచములో అన్నీ గుర్తించి యిన్ని కోట్లని నెంబరు చెప్పవచ్చు. ఆ కోట్లకు తరువాత మరి యేమి చెప్పగలవు? అన్నింటినీ చూస్తే కట్టకడపటికి ఏమీ అర్థముకాదు. మనము పదములు మాత్రమే ఉపయోగిస్తున్నాముగానీ పదస్వరూపాన్ని గుర్తించుటకు ప్రయత్నించుటలేదు. ప్రతి మానవునియందు ఉన్నది అదొక్కటే. ఆ ఫండమెంటల్ ప్రినిసిపుల్ ప్రతి మానవునియందు ఉంటున్నాది. లవ్ ఈజ్ గాడ్ అన్నప్పుడు లవ్ ఆజ్ ఎవ్విర్‌వేర్. ఈ ఫండమెంటల్ ప్రినిసిపుల్ సర్వులయందు ఉంటున్నది. మనము అర్థము చేసికోటానికి ప్రయత్నిస్తే ఒక్కటే ఒక్కటి తేలుతుంది. అది ఆధ్యాత్మిక మార్గములో మాత్రమే గుర్తించుటకు వీలవుతుంది. నిదానంగా, అంతర్ముఖంగా ఆలోచన చేస్తూ చేస్తూ పోతే కట్టకడపటికి లేనిది అదొక్కటే. ఈనాడు పరిశీలన చేయటం లేదు. ఈ పరిశీలన కూడా అర్థం పర్థం లేకుండా పోతున్నాది. కాదు కాదు. అంతర్ముఖముగా నిజమైన దృష్టితో చూడాలి.

ప్రేమస్వరూపులారా! అర్థములేనిదానికోసము మీ కాలము వ్యర్థము చేసుకోకండి. దైవమున్నాడు, నీవే దైవము. దీన్ని నీవు నమ్ము. నమ్మకము చేతనే మనకు గుర్తించుటకు వీలవుతుందిగానీ నమ్మకము లేకపోతే దేన్నీ మనము గుర్తించలేము. కనక, మొట్టమొదట ‘ఐ’ అనేదాన్ని నమ్ము. అప్పుడే రెండవదైన ‘యు’ ని అర్థము చేసుకోటానికి వీలవుతుంది. ‘ఐ’ అనేది అర్థము కానప్పుడు ‘యు’ ఎట్లా అర్థమవుతుంది. ఒక్కఇన్న పదము. ఐ ప్లస్ యు రెండూ చేరినప్పుడు వుయ్యి అవుతుంది. వుయ్యి ప్లస్ హి ఏమవుతుంది? ‘హి’ అవుతుంది. ‘హి’ అనేది ఎప్పటికీ ఉండేటువంటిది. ఐ మార్పు చెందుతుంది. వుయ్యి మార్పు చెందుతుంది. జీవితములో నీవే మార్పు చెందుతున్నావు. ఈ మార్పు చెందేదాన్ని నీవు నమ్ముకొని ప్రయోజనం లేదు. అన్నింటికి ‘హి’. అదియే దైవత్వము. ఆ దైవత్వమే నీ యందు, వారి యందు, అందరి యందు ఉంటున్నది. హి ఈజ్ ఎవ్విరివేర్, విత్ యు, ఎబొవ్ యు, బిలో యు, ఎరౌండ్ యు. కానీ ‘ఐ’ అనేది ఇన్ మి అని చెప్పటానికి వీలు లేదు. కనుక, ఆ ‘హి’ అనేది సంపూర్ణమైన దైవత్వాన్ని బోధిస్తున్నాది. ఇలాంటి తత్త్వాన్ని నమ్మకముతో దృఢము చేసుకోవాలి. ఒక చిన్న విషయము. ‘ఇతనిని నేను ప్రేమిస్తున్నాను, అతనిని తప్ప నేను దేనినీ ప్రేమించటం లేదు’. ఇది ఎట్లా సత్యమవుతుంది? నిన్ను నీవే ప్రేమించుకోటం లేదు. అతన్ని ఏరీతిగా ప్రేమించగలవు? ఇది నా దేహము. దేహాన్ని నమ్మగలుగుతున్నావా? నమ్మటం లేదు. ఈ దేహము మార్పు చెందేదే. అన్నీ మార్పు చెందేవే. ఆ దైవత్వము అన్నింటికీ అతీతమైనది. అదియే నిజమైన ఆత్మతత్త్వము. దీనికి వేరే మరోక పేరు లేదు. ఆత్మ అనేదే పేరు. ఆత్మ అని ఎవరు పెట్టారు? ఒకరు పెడితే వచ్చినది కాదు. ఆత్మ సర్వత్రా నిండినది. అటువంచి ఆత్మతత్త్వాని ఏ పేరన ఇపెట్టగలవు. పేర్లు పెట్టటం కాలమును వ్యర్థం చేసుకోటమే. ఈ పేర్లు పెట్టుకొని కాలము వ్యర్థం చేసుకోవద్దు. దానిని నమ్మి, విశ్వసించి ప్రచారము చెయ్యి. సంపూర్ణ విశ్వాసము పెట్టుకున్నప్పుడే అన్నింటియందు నమ్మకము కల్గుతుంది. వర్షమునుండి నీటిబిందువులు పడుతున్నాయి. ఈ బిందువులన్నీ చేరినప్పుడు పాత్ర నిండిపోతుంది. నిన్ను నేను ప్రేమిస్తున్నాను అని అందరినీ ప్రేమించటమనేది వర్షబిందువులు వంటిది. కానీ నేను ప్రేమిస్తున్నాను అంటే దేనికి చెందుతుంది? దీనినే ఆత్మ అన్నారు. ఈ ఆత్మ

అనేదానికి బిందువు, నీరు అని పేరు లేదు. ఇలాంటి తత్త్వాన్ని మనం గుర్తించుకొని నమ్మకం చేతనే దైవాన్ని సాధిస్తూ రావాలి. దైవాన్ని నమ్మకుండా ఏ ప్రయత్నం చేసినా అదంతా వ్యర్థమే అయిపోతుంది. 'నేను' అని నీ దేహాన్ని ఉచ్చరిస్తున్నావేగానీ అనంతంగా ఉండే తత్త్వాన్ని నీవు చెప్పగలుగుతున్నావా? కనుక, అర్థముకాని దానిలో నీవు ప్రవేశించవద్దు. మొట్టమొదట నీయందున్న తత్త్వం ఆ నమ్మకం. అదియే నీ యందున్న చైతన్యం. ఈ చైతన్యమే లేక నీవు లేవు. మొట్టమొదట నీవు కన్నులు మూసుకొని అంతర్ముఖముగా ధ్యానము చేసి ఆత్మతత్త్వాన్ని గుర్తించు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన'. సాధన లేక దేనినీ మనము సాధించలేము. కనకక, సాధన చేసి అంతర్ముఖముగా సాధించిన తరువాతనే వాదప్రతివాదములకు నీవు పూనుకోవచ్చును. మొట్టమొదట నీ దేహతత్త్వాన్ని నీవు గుర్తించు. ఇది భౌతిక దేహము. ఇందులో అన్ని రకములైన అంగములు ఉంటున్నాయి. అంగములు నేను కాదు. అన్ని అంగములలోనా ఉన్నవాడినే నేను. ఇది నా చేయి. నా వేళ్ళు.వేళ్ళు అంటే ఏమిటి? ఐదు వేళ్ళు చేరినప్పుడే చేయి అయంది. ఈవిధంగా విచారణ చేస్తూ పోతే అన్నింటియందు ఉన్నది ఒక్కటే. ఆధ్యాత్మిక తత్త్వాన్ని అర్థం చేసుకోటం కష్టము. కష్టము కష్టమని దానిని వదలకూడదు. లోకములోనున్న వస్తువాహనాదులను మనం సాధించనక్కరలేదు. ఆ ఉన్న ఆత్మతత్త్వాన్ని మనం సాధిస్తే సర్వమూ సాధించిన వారమౌతాము. ప్రతి దానికీ నీవు ప్రశ్న వేసుకోవాలి. నేను ఎవరు? నేను ఎవరు? నేను ఎవరు? అని అంటుంటే తప్పక అర్థమవుతుంది. ఈ నేను ఏ రూపంలో ఉంది? ఇది అరూపర్‌లో ఉంటున్నది. కనుక, నేను అనే తత్త్వాన్ని ఆత్మతత్త్వంగా విశ్వసించాలి. అనేకమంది ఆత్మకు అనేక రూపములు చెబుతున్నారు. కానే కాదు. మొట్టమొదట నేను అనే తత్త్వానికి చైతన్యశక్తిని చూపించాలి. మానవుని యందున్న చాతన్యశక్తి మరిదేనియందు లేదు.

ప్రేమస్వరూపులారా! విద్యార్థులైన మీకు ఆధ్యాత్మికము అంత సులభంగా అర్థమయ్యేది కాదు. కనీ నమ్మకము పోషించుకుంటే తప్పక సులభంగా అర్థమవుతుంది.

నమ్మకమను రెండు నయనంబులే లేని
అంధులైరి మనుజులవనియందు.

ప్రేమ అంటే ఏమిటి? దాన్ని కూడా అర్థం చేసుకోలేరు. చీకటి.. చీకటిని చూచిన వారెవరు? కన్నులు మూసుకో. ఏమిటి చూస్తున్నావు? చీకటిని చూస్తున్నావు. చీకటిని చూచేవాడు ఎవరు? ఆ చీకటిని చూచేవాడు ఒకడు ఉండాలికదా. ఆ చూచేవాడు లేక చీకటి అని ఎట్లా చెప్పగలవు? కనుక, ప్రతిదానికీ ఒకవిధమైన రూపము ఉంటున్నాది. ఒక్క వస్తువును మనం ఆధారంగా తీసుకోవాలి. అదియే నిజమాన సత్యాన్ని వెతికే సాధన. ఆ రియాలిటీని మనం చూడాలనుకొంటే నమ్మకము కావాలి. ఆ నమ్మకము చేతనే నీవు ప్రయాణము చేయి. నమ్మకం లేక ప్రయాణం చేయలేవు. నీవు ఎక్కడికో పోతున్నావు. ఎక్కడికి పోతున్నావో తెలియనప్పుడు ఎక్కడ చేరగలవు? మొట్టమొదట నేను మందిరమునకు పోతున్నాను అని నిర్ణయం చేసుకోవాలి. మందిరము ఉందో లేదో కానీ మందిరమునకు పోతున్నానని ఒక నిర్ణయమునకు రావాలి. నీవు మందిరానికి చేరగలవు. ఎక్కడికి పోతున్నావో తెలియనప్పుడు ఎట్లా చేరగలవు? కనక, మొట్టమొదట ఆత్మ దైవము అని గుర్తు పెట్టుకోవాలి. ఈ ఆత్మ అనేదాన్ని నీవు గుర్తుపెట్టుకుంటే ఎక్కడైనా నీవు తిరగవచ్చు. ఈవిధమైన ప్రయాణములోపల నీవు ఆత్మతత్త్వమును అర్థము చేసుకోవాలి.

ప్రేమస్వరూపులారా! మీకు ప్రేమ అంటేనే తెలియటం లేదు. దేహాన్ని చూసి ప్రేమిస్తున్నావు. ధనాన్ని చూసి ప్రేమిస్తున్నావు. రూపాన్ని చూసి ప్రేమిస్తున్నావు. ప్రవర్తన చూసి ప్రేమిస్తున్నావు. ప్రవర్తన ఎక్కడనుండి వచ్చింది? రూపము ఎక్కడనుండి వచ్చింది? ధనము ఎక్కడనుండి వచ్చింది? అందము ఎక్కడనుండి వచ్చింది? అందచందములకు ఆధారము ఏమిటని అని గుర్తించటం లేదు. కొంతకాలము దీన్ని చూసి ప్రేమ అంటావు. కానీ ఆ ప్రేమ ఎంతకాలం ఉంటుంది? మార్పుచెందుతన్నాది. ఈ మార్పుచెందేదాన్ని ప్రేమించి ప్రయోజనం లేదు. మార్పు చెందని తత్త్వాన్ని

మనం ప్రేమిస్తూరావాలి. ఆ మార్పు చెందనిదే ఆత్మతత్త్వము. దనిలో ఏ మార్పూ లేదు. ఏ కూర్పు లేదు. మనం చెబుతూవుంటాం 'ఆయనంటే చాలా ప్రేమ'. ఆయన గురించి ఏమి తెలుసుకున్నావు? రూపాన్ని చూసి ప్రేమిస్తున్నావా? ప్రవర్తన చూసి ప్రేమిస్తున్నావా? అందాన్ని చూసి ప్రేమిస్తున్నావా? దేన్ని చూసి నీవు ప్రేమిస్తున్నావు? దేన్ని చూసి నీవు ప్రేమించటం లేదు. ఇవన్నీ తాత్కాలికంగా జరిగిపోతుంటాయి. ప్రేమ అనేది ఒకటుంది. ఆ ప్రేమయే దైవము. అందుకోసమే దైవము ప్రేమస్వరూపము. ప్రేమకై ప్రేమించు. ప్రేమ లేక ప్రాణము లేదు. దీనికి ఒక చిన్న ఉదాహరణ. ఒక తల్లికి 20 సంవత్సరముల కుమారుడున్నాడు. కొంతకాలమునకు కుమారుడు మరణించాడు. తల్లి ఒక్కతే ఉన్నది. తల్లి చెబుతున్నాది,' నీవు ఉన్నావనే నేను బ్రతుకుతున్నాను. నీవు లేకపోతే నేను బ్రతికేది ఎట్లా?' కాబట్టి 'నేను' అనేది ఎక్కడ? ఇవి కల్పనలే కానీ సత్యములు కావు. ప్రేమయే ప్రధానము. ప్రేమకు ఒక్క రూపము కాదు. ఈ ప్రేమను ప్రేమించిన వాడే ప్రేమను పొంద గలడు. కేవలం దేహాన్ని ప్రేమించిన వాడు దేహమున్నంత వరకే ప్రేమిస్తాడు. తదుపరి దేనినీ ప్రేమించడు. కనుక, నీవు ప్రేమను ప్రేమించు. ఈ ప్రేమయే ప్రాణము. ప్రాణమే దైవము. అదియే ఆత్మ. సత్యమైనది ఆత్మతత్త్వము ఒక్కటే.

ప్రేమస్వరూపులారా! ప్రేమచేతనే మీరు ప్రేమను పొందాలి.

ప్రేమరహితమగు భూములలో ప్రేమాంకురములు పెంపొందా
ప్రేమావేశముతో ప్రేమనదులు ప్రవహింపగ
గానము చేయగదే! కృష్ణా! గానము చేయగదే!

ప్రేమ నదులు ప్రవహించాలి. ప్రేమకు బీజములుండాలి. ఒక్క ప్రేమ తత్త్వాన్ని మనం అర్థంచేసుకుంటే చాలు. ఈ ప్రేమయే సర్వమూ. ప్రేమనే సర్వముగా భావించుకొని ప్రేమనే ఆధారం చేసుకో. ఈ ప్రేమలో ఏదో ఒక పదార్ధమును పెట్టుకొని పూజించ వద్దు. భౌతికమైన మస్తువులను పెట్టుకుంటే అన్నీ శూన్యమైపోతాయి. ప్రేమను మాత్రమే ప్రేమిస్తూపోతే ప్రేమ ఎప్పుడూ శాశ్వతంగా ఉంటుంది. కనుక, ప్రేమను మనం ప్రేమిస్తూ రావాలి. మనము ప్రేమించ వలసినది ప్రేమనేగానీ ప్రేమతో కూడిన కాయమును కాదు. రూపాలన్నీ అనిత్యములు, అశాశ్వతములు. అశాశ్వతము, అసత్యమైన వాటిని మనం ప్రేమించకూడదు. అదియే భౌతికమైన ప్రేమ. ప్రేమను మాత్రమే ప్రేమించేది శాశ్వతమైన ప్రేమ. ఇలాంటి ప్రేమచేతనే దైవత్వాన్ని పొందాలి.

విద్యార్థులారా! నీయొక్క ఆత్మతత్త్వమే నీ రూపము. అది ఎన్ని రూపములైనా ధరిస్తుంది. కనుక, దైవాన్ని రూపముగా భావించరాదు. రామ, కృష్ణ, గోవింద యివి పెట్టిన పేర్లేగానీ పుట్టిన పేర్లు కాదు. ఈ పెట్టిన పేర్లకు ఫలితము లేదు. కానీ ఏదో ఒక నామాన్ని మనం నిర్ణయం చేసుకోవాలి. చదువులన్నీ చదవటం అవసరమే. చదువులలోని సారము గుర్తించటము సత్యమే. అది ఎంతవరకు సత్యమౌతుంది? అనుభవించేంతవరకు సత్యమవుతుంది. అనుభవించిన తరువాత ఆ సత్యం కూడా అదృశ్యం అయిపోతుంది. కనుక, మీరు రూపాన్ని ఆధారం చేసుకోవద్దు. ప్రేమయే దైవం. ప్రేమకు ఒక రూపం లేదు. ఆ ప్రేమను పెంచుకుంటూ పొండి. దీనికి సత్యాన్ని విచారణచేస్తే సులభంగా మీకు అర్థమవుతుంది. భగవంతుడనేవాడు ఒకడున్నాడు. భగవంతుడు లేకపోతే యీ ప్రకృతే లేదు. ప్రకృతి నుండి పరమాత్మయే వస్తున్నాది. పరమాత్మ నుంచే పరతత్త్వము ఏర్పడుతున్నాది. ఆ పరతత్త్వమే నిజమైన ఆత్మతత్త్వము. అటులనే పరతత్త్వాన్ని నీవు ప్రేమిస్తూ రా. ఈ ప్రేమను ఒక రూపంగా తీసుకొని మీరు ప్రార్థిస్తూ రాకండి. రూపమంతా మార్పుచెందుతూ వస్తుంది. మీకు ఎప్పుడైనా అవకాశము చిక్కినప్పుడు ప్రేమతత్త్వాన్ని చెబుతాను. పిల్లలకు చక్కగా యీ ప్రేమ తత్త్వము చక్కగా అర్థమైనప్పుడే నిరాశకు అవకాశము యివ్వరు. నిరంతరము పిల్లలు ఆశనిరాశల దిశలోనే పడిపోతున్నారు. ప్రేమకు నామమే ఉంది తప్ప రూపము లేదు. ఆ పేరుకు ఏదైనా రూపం పెట్టుకోవచ్చు.

ప్రేమస్వరూపులారా!దైవాన్ని మీరు పొందాలనుకుంటే ఒక్కటే మార్గము చాలు. అదియే ప్రేమ. అదియే సత్యం. ఆ సత్యాన్ని పట్టుకొని పొండి. ఆ ప్రేమను పట్టుకొని పొండి. నేను అనేదానికి రూపం పెట్టకండి. చిన్న ఉదాహరణ. నిన్న పేపర్లో పడింది. జానకిరామయ్య మొన్న పోయాడు. అతన్ని ప్రేమించినవారు అనేకమంది ఉంటున్నారు. వారంతా దినమూ పేపర్లో వేస్తున్నారు. 'జనకిరామయ్యా! మీరు మమ్మల్ని వదలి వెళ్లారు. తిరిగి మీరు పుట్టండి. అప్పుడు మేము ప్రేమిస్తాము'. వీరి ప్రేమకు తిరిగి తాను పుట్టవలెనా? ఇదా మనం కోరవలసినది? పుట్టటం, చావటం యీ రెండింటి యందే మోసం అయిపోతున్నాది. జననమరణములు రెండూ అసత్యములే. జననం ఉండినప్పుడు మరణం వస్తుంది. జననమరణాలు దేహానికేగానీ ఆత్మకు కాదు. కనుక, ఆత్మతత్త్వాన్ని మనం ప్రేమించాలిగానీ జననమరణాలు గల్గిన దేహాన్ని కాదు. బంగారు. మిమ్మల్ని బంగారు అని పిలుస్తుంటాను. బంగారు అనటంలోనున్న అంతరార్థం ఏమిటి? బంగారు చిక్కుతుంది. బంగారు ఏనాటికీ పోదు. బంగారును కరిగించ వచ్చును. నగలుగా మార్చుకోవచ్చు. కానీ బంగారును మార్చుటకు వీలుకాదు. కాబట్టి మీరు బంగారుతో చేరిన రూపాలుగా ఎన్నైనా మారుతూ ఉండవచ్చు. కానీ బంగారును మాత్రం నీవు పెట్టుకో. అది ఎప్పటికీ మారదు. మారనది కోరుకోవాలి. మారే రూపాన్ని కోరుకుంటే మోసం అయిపోతుంది. కనుక, మారని దానితో పోల్చి మిమ్మల్ని బంగారు అని పిలుస్తుంటాను. నీవు చచ్చేవాడూ కాదు, తిరిగి పుట్టేవాడూ కాదు. బంగారు ఎప్పుడూ బంగారే. అది శాశ్వతమైనదే. అది సత్యమైనదే. ఆ సత్యనిత్యమైన దానిని మనం కోరుకోవాలిగానీ సత్యనిత్యము కానిది కోరుతూ మోసములో పడిపోతున్నాము. కనుక, శంకరులవారు చెప్పారు,

పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరే శయనం
యిహసంసారే బహుదుస్తారే
కృపయాపారే పాహి మురారే!
భజగోవిందం భజగోవిందం
గోవిదం భజ మూఢమతే!

గోవ్దుని భజించండి. కనుక, మనం చావుపుట్టుకలు లేనిదాన్ని కోరుతూ రావాలి. తిరిగి పుట్టుక ఎందుకు కోరాలి? పుట్టుక లేనిదాన్ని కోరాలి.

ప్రేమస్వరూపులారా! మీయందున్న ప్రేమ పుట్టేది కాదు, గిట్టేది కాదు. ఆ ప్రేమను మీరు ప్రేమించండి. ఆ ప్రే నిరంతరము నీ వెంటనే, జంటనే, యింటనే ఉంటుంది. ఆ ప్రేమనే మీరు ప్రేమించాలి. ఇలాంటి దాన్ని మీరు ప్రేమిస్తుంటే ఎంతకాలమైనా ప్రేమస్వరూపులుగానే ఉంటారు. సత్యంగా యీ ప్రేమను మాత్రం మీరు నమ్మండి. లౌకికమైన ప్రేమను మీరు నమ్మకండి. నమ్మి, నమ్మి చాలా మోసం అయిపోతున్నారు. ఈ ప్రేమ అంతా తాత్కాలికమైన మేఘములు. మేఘములు వస్తుంటాయి, పోతుంటాయి. శాశ్వతమైన మేఘము ఒక్కటీ లేదు. కనుక, శాశ్వతమైన ప్రేమను మీరు ప్రేమించండి. అదే ఆత్మ. ఆత్మను ప్రేమించు. చదువులు చదవండి. చదువులోనున్న అర్థాన్ని గుర్తించండి. గుర్తించుకున్న అర్థాన్ని ప్రాక్టికల్‌లో పెట్టండి. ప్రాక్టికల్‌లో పెట్టినదానిని అనుభవించండి. అనుభవించిన దానిని ఆనందించండి. అంతేగానీ ప్రతిదానినీ ప్రేమించి నిరాశకు గురికాకూడదు. ప్రేమ ఒక్కటే శాశ్వతమైనది. ఈ శాశ్వతమైన ప్రేమను మీరు ప్రేమించండి. ఈ ప్రేమకు రూపాన్ని పెట్టుకొని నిరాశకు చోటివ్వకండి. చాలా మంది పిల్లలు ఆ విధంగా నిరాశకు గురౌతున్నారు. కట్టకడపటికి దేనినీ ప్రేమించలేకపోతున్నారు. ప్రేమించినదాన్ని ఏమాత్రం వదలకుండా ప్రేమిస్తూనే పోవాలి. అదియే పెరుగుతూ పెరుగుతూ పోతుంది.

ప్రేమస్వరూపులారా! మిమ్మల్నందరినీ 'ప్రేమస్వరూపులారా' అనే పిలుస్తాను. ఆ ప్రేమను మాత్రమే మీరు పెంచుకోండి. ఆ ప్రేమ మీ వెంట ఉన్నప్పుడు అదే మిమ్మల్ని కాపాడుతుంది.

ప్రేమముదిత మనసె కహో రామరామరాం……

(2003 అక్టోబరు 28వ తేదీ దసరా సందర్భముగా భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)